సాక్షి కర్నూలు

శుక్రవారం। 4 । ఏప్రిల్ । 2025



చౌడేశ్వరిదేవికి ప్రణమిల్లి..

నందవరంలో బుధవారం అర్ధరాత్రి నుంచి జ్యోతి మహోత్సవం కనులపండువగా సాగింది. ఇరు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా కర్ణాటక, మహారాష్ట్రాల నుంచి భక్తులు వచ్చారు. 8లో▸



కమనీయం.. రథోత్సవం

ఆస్పరి మండలం కైరుప్పల గ్రామంలో గురువారం అశేష జనవాహిని మధ్య వీరభద్రస్వామి రథోత్సవం కనుల పండవగా జరిగింది. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు కదిలి వచ్చారు. 8లో▸



వీరభద్రా.. శరణు !

తుగ్గలి మండలం ఎదులదొడ్డిలో వీరభద్రస్వామి రథోత్సవం వైభవంగా సాగింది. స్థానికులతో పాటు వివిధ గ్రామాల భక్తులు స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. 8లో▸

న్యూస్‌రీల్

మార్కెటింగ్ శాఖకు పెరిగిన ఆదాయం

కర్నూలు(అగ్రికల్చర్): 2024–25 సంవత్సరంలో మార్కెటింగ్ శాఖకు ఆదాయం పెరిగింది. వ్యవసాయ ఉత్పత్తుల క్రయవిక్రయాలపై వ్యాపారుల నుంచి సంబంధిత మార్కెట్ కమిటీలు 1 శాతం ఫీజు వసూలు చేస్తారు. ఆ ప్రకారం రూ.36.18 కోట్ల ఫీజు వసూలు లక్ష్యం కాగా, రూ.39.36 కోట్లు వసూలైంది. కర్నూలు, ఆదోని, ఎమ్మిగనూరు, పత్తికొండ మార్కెట్ కమిటీలు లక్ష్యాలను అధిగమించగా.. మంత్రాలయం, కోడుమూరు, ఆలూరు మార్కెట్‌లు వెనుకబడినట్లు మార్కెటింగ్ శాఖ ఏడీ నారాయణమూర్తి తెలిపారు.

విజిబుల్ పోలీసింగ్ మరింత బలోపేతం



ట్రాఫిక్ ఉల్లంఘనలపై కౌన్సెలింగ్ ఇస్తున్న పోలీసులు

కర్నూలు: విజిబుల్ పోలీసింగ్‌ను మరింత బలోపేతం చేయాలని క్షేత్రస్థాయి పోలీసు అధికారులను ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశించారు. ఎస్పీ ఆదేశాల మేరకు జిల్లా అంతటా పోలీసు అధికారులు గురువారం వాహన తనిఖీలు నిర్వహించారు. అనుమానితులను విచారించి వాహన రికార్డులను పరిశీలించారు. రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ద్విచక్ర వా హనదారులు తప్పనిసరిగా హెల్మెట్, నాలుగు చక్రాల వాహనదారులు సీటు బెల్టు ధరించాలని సూచించారు. సెల్ ఫోన్ డ్రైవింగ్, డ్రంకెన్ డ్రైవింగ్‌కు దూరంగా ఉండాలని తనిఖీల సందర్భంగా డ్రైవర్లకు సూచించారు. రహదారి భద్రతా నియమాలు పాటించకపోతే చర్యలు తప్పవని స్టేషన్ల వారీగా హెచ్చరించారు.

5న బాబు జగ్జీవన్‌రామ్ 118వ జయంతి

కర్నూలు(అర్బన్): మాజీ ఉప ప్రధాని దివంగత డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ 118వ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు సాంఘిక సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ జె.రంగలక్ష్మిదేవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా అధ్యక్షతన స్థానిక ఆర్ఎస్ రోడ్డులోని బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహం కూడలిలో జయంతి కార్యాక్రమలను నిర్వహిస్తామన్నారు. ముందుగా జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసిన అనంతరం అక్కడే జయంతి సభను ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమానికి జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, దళిత, ప్రజా సంఘాలకు చెందిన నాయకులు, ప్రజలు, వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు హాజరు కావాలని జేడీ కోరారు.

మెరిట్, ఎంపిక జాబితా విడుదల

కర్నూలు(హాస్పిటల్): ఉద్యోగాల భర్తీకి ఫైనల్ మెరిట్ లిస్ట్, సెలక్షన్ లిస్ట్ విడుదల చేసినట్లు కర్నూలు మెడికల్ కాలేజి ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలోని ప్రభుత్వ మెడికల్ కాలేజ్, జనరల్ హాస్పిటల్స్, గవర్నమెంట్ నర్సింగ్ కాలేజీలకు సంబంధించి ఉద్యోగాల భర్తీకి 2023 నవంబర్ 20న నోటిఫికేషన్ ఇచ్చినట్లు పేర్కొన్నారు. మొత్తం 11 కేటగిరీల అభ్యర్థుల ఫైనల్ మెరిట్, సెలక్షన్ జాబితాను https:// kurnool. ap. gov. in, https:// nandyal. ap. gov. in, https:// kurnoolmedical. ac. inలల వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేశామమని పేర్కొన్నారు. ఎంపికైన అభ్యర్థులు వారి ఒరిజినల్ సర్టిఫికెట్లు, రెండు సెట్ల నకలు సర్టిఫికెట్లతో ఈ నెల 9 నుంచి 11వ తేదీ వరకు ఉదయం 10.30 గంటలకు కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ కార్యాలయంలో నిర్వహించే కౌన్సెలింగ్‌కు హాజరుకావాలన్నారు. హాజరుకాని అభ్యర్థుల ఎంపిక రద్దు చేస్తామన్నారు.

రైతుసేవా కేంద్రాల్లో జొన్నల కొనుగోలు

కర్నూలు(సెంట్రల్): రైతుసేవా కేంద్రాల్లో మహేంద్ర రకం జొన్నలు కొనుగోలు చేస్తున్నట్లు జేసీ డాక్టర్ బి.నవ్య గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ–క్రాప్, ఈకేవైసీ చేయించుకున్న రైతులు తమ పేర్లను సచివాలయాల్లో నమోదు చేసుకుంటే క్వింటా జొన్నలు రూ.3,371 ప్రకారం కొనుగోలు చేస్తామన్నారు. నిర్దేశించిన మేరకు నాణ్యత ఉండే జొన్నలనే కొనుగోలు చేస్తామని.. హమాలీ, రవాణా ఖర్చులను పౌరసరఫరాల సంస్థ భరిస్తుందన్నారు.

జగమంత కుటుంబం.. అభిమాన తరంగం

చేతులెత్తి మొక్కుతూ.. మనసారా అభివాదం చేస్తూ.. చిరునవ్వులతో స్వాగతిస్తూ.. అభిమాన తరంగం ఉవ్వెత్తున ఎగిసింది. జగమంత కుటుంబం ఆత్మీయత పంచగా.. అడుగడుగునా ఆప్యాయత స్వాగత తోరణమైంది.

- మాజీ సీఎం వైఎస్ జగన్‌ను చూసేందుకు భారీగా తరలివచ్చిన ప్రజలు
- వివాహ వేడుకకు హాజరైన మాజీ ముఖ్యమంత్రి
- అభిమానులతో కిటకిటలాడిన కన్వెన్షన్ హాలు
- పాల్గొన్న ఉమ్మడి కర్నూలు జిల్లా అధ్యక్షులు, వైఎస్సార్‌సీపీ నేతలు



మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని చూసేందుకు భారీగా తరలి వచ్చిన ప్రజలు

ముస్లింల అభిమానం



అభివాదం చేస్తున్న మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

కర్నూలు (టౌన్): మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని చూసేందుకు ప్రజలు భారీగా తరలివచ్చారు. 'జై జగన్.. సీఎం..సీఎం' అంటూ నినాదాలు చేశారు. మాజీ ముఖ్యమంత్రితో కరచాలనం చేసేందుకు పోటీ పడ్డారు. భారీగా అభిమానులు రావడంతో రోడ్లు కిక్కిరిసి పోయాయి. కుడా మాజీ చైర్మన్ కోట్ల హర్షవర్ధన్ రెడ్డి కుమార్తె వివాహ వేడుక గురువారం కర్నూలు నగర శివారులోని జీఆర్‌సీ కన్వెన్షన్ హాలులో నిర్వహించారు. వివాహ వేడుకకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హాజరయ్యారు. నూతన దంపతులు శ్రేయ, వివేకానంద విరూపాక్షిని ఆశీర్వదించా రు. వధూవరులకు వివాహ శుభాకాంక్షలు తెలిపారు. మాజీ ముఖ్యమంత్రిని చూసేందుకు, సెల్ఫీ దిగేందుకు అభిమానులు పోటీ పడ్డారు. ప్రజలు భారీగా తరలి రావడంతో కన్వెన్షన్ హాలు కిక్కిరిసిపోయింది.

ఆప్యాయంగా పలకరించి..

తాడేపల్లి నుంచి కర్నూలు నగరంలోని మైపర్ మైదానం హెలిపాడ్‌కు చేరుకున్న మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వైఎస్సార్‌సీపీ కర్నూలు, నంద్యాల జిల్లాఅధ్యక్షులు ఎస్వీ మోహన్‌రెడ్డి, కాటసాని రాంభూల్‌రెడ్డి, పార్టీ ఎమ్మెల్యేలు బాలనాగిరెడ్డి, బూసినె విరూపాక్షి, ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్ స్వాగతం పలికారు. మాజీ ఎంపీలు బుట్టా రేణుక, పోచా బ్రహ్మానందరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు హఫీజ్‌ఖాన్, సాయి ప్రసాద్‌రెడ్డి, కంగాటి శ్రీదేవి, ఎర్రకోట చెన్న కేశవరెడ్డి, శిల్పా చక్రపాణి రెడ్డి, కాటసాని రామిరెడ్డి, బిజేంద్రా రెడ్డి, శిల్పా రవి కిషోర్ రెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, మేయర్ బీవై రామయ్య, పార్టీ నేతలు ఆదిమూలపు సతీష్, బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి, దార సుధీర్, పార్టీ రాష్ట్ర నాయకులు తెర్నేకల్ సురేంద్ర రెడ్డి, సుభాష్ చంద్రబోస్, విజయ మనోహరి, శశికళ, గాజుల శ్వేతారెడ్డి స్వాగతం పలికారు. పూలబోకేలు ఇచ్చి శాలువాలు కప్పారు. ఉమ్మడి జిల్లాల నుంచి వచ్చిన వైఎస్సార్‌సీపీ నేతలను మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అప్యాయంగా పలకరించారు. ప్రతి ఒక్కరి యోగక్షేమాలు తెలుసుకున్నారు.

ఆత్మీయత.. అభిమానం

హెలిపాడ్‌కు భారీగా చేరుకున్న ప్రజలు 'సీఎం.. సీఎం' అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. జొహరాపురం రోడ్డు జనంతో నిండిపోయింది. హెలిపాడు నుంచి అందరికీ అభివాదం చేసుకుంటూ కారులో జీఆర్‌సీ కన్వెన్షన్‌కు మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బయలు దేరారు. అందరికీ అభివాదం చేశారు. జననేతను చూసేసరికి అభిమానులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. మాజీ ముఖ్యమంత్రి పర్యటనలో ఆద్యంతం ఆత్మీయత, అభిమానం కనిపించింది.



మాజీ ముఖ్యమంత్రిని చూసిన ఆనందంలో ప్రజల సంతోషం





దూరం నుంచే అభివాదం చేస్తున్న ప్రజలు (ఇన్‌సెట్‌లో) మాజీ సీఎంతో సెల్ఫీ తీసుకుంటున్న చిన్నారి

విరుచుకుపడిన వరుణుడు!

- ఆశలు వర్షార్పణం
- పలు ప్రాంతాల్లో అకాల వర్షాలు





బండిఆత్మకూరు కడమల కాలువ గ్రామంలో నేలకొరిగిన వరి (ఇన్‌సెట్) కురిసిన వడగండ్లు

కర్నూలు(అగ్రికల్చర్)/సాక్షినెట్‌వర్క్: జిల్లాలోని వి విధ ప్రాంతాల్లో అకాల వర్షాలు కురవడంతో అన్నదాతకు నష్టం వాటిల్లింది. దేవనకొండ, సి.బెళగల్, కోడుమూరు మండలాల్లో కోసి ఆరబెట్టిన ఉల్లి పూర్తిగా తడిచిపోయింది. కొన్ని చోట్ల టార్పాలిన్లు కప్పుకున్నా ఫలితం లేకుండా పోయింది. వాతావరణంలో మార్పులు చోటు చేసుకోవడంతో గురువారం మధ్యాహ్నం 3 గంటల సమయం నుంచి వివిధ ప్రాంతాల్లో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిశాయి. అలాగే రాత్రి 7 నుంచి 11 గంటల వరకు అకాల వర్షాలు కురిశాయి. దేవనకొండ మండలం ఈదులదేవరబండ గ్రామంలో 42.5 మి.మీ. వర్షపాతం నమోదైంది. సి.బెళగల్ మండలంలో 21.5 మి.మీ., ఎమ్మిగనూరు మండలంలో 20.5 మి.మీ., గూడూరు మండలంలో 10 మి.మీ. ప్రకారం అకాల వర్షాలు కురిశాయి. కోడుమూరు, ఆదోని, గోనెగండ్ల, పత్తికొండ, కర్నూలు తదితర మండలాల్లో కూడా వర్షాలు కురిశాయి.

నష్టాలు ఇలా..

- సి.బెళగల్ మండలంలో గురువారం సాయంత్రం కురిసన గాలివానతో పొలాల్లో ఉన్న పైర్లు దెబ్బతిన్నాయి. కల్లాల్లో ఉన్న మిరప, పొగాకు దిగుబడులు తడిసిపోయాయి. తుంగభద్ర నది తీర గ్రామాల్లో రబీలో సాగు చేసిన వరి పైరు నేలకొరిగింది.
- దొర్నిపాడు, క్రిష్టిపాడు, డబ్ల్యూ గోవిందిన్నె గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. భారీ గాలులకు మిరప కాయలన్నీ రాలిపోయాయి. కల్లాల్లో ఉన్న మిరప పూర్తిగా తడిసి పోయింది.
- కొలిమిగుండ్ల, కల్వటాల, నందిపాడు, తిమ్మనాయినపేట, కమ్మవారిపల్లె, అబ్దులాపురం గ్రామాల్లో ఉరుములు, మెరుపులతో వర్షం పడింది. పసుపు పంటను కోసిన రైతులు ఉడికించేందుకు తిమ్మనాయినపేట గ్రామం శివారులో ఆరబెట్టుకున్నారు. ఉన్నట్లుండి అకాల వర్షం కురవడంతో రైతులు పరుగులు పెట్టి తడవకుండా పట్టలు కప్పుకోవాల్సి వచ్చింది.
- మహానంది మండలంలో గురువారం సాయంత్రం అరగంట పాటు ఓ మోస్తరు వర్షం కురిసింది. తిమ్మాపురం, బుక్కాపురం తదితర గ్రామాల్లోని పొలాల్లో ఆరబెట్టిన పసుపు తడిచిపోయింది. దీంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.
- బండిఆత్మకూరు మండలంలో ఊహించని విధంగా ఈదురు గాలులతో కూడిన వర్షం పడింది. కడమల కాలువ, వెంగళరెడ్డి పేట, ఈర్నపాడు, సింగవరం గ్రామాల్లో కొన్నిచోట్ల వరి నేల కొరిగింది. దీంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది.
- కోవెలకుంట్ల వ్యవసాయ సబ్‌డివిజన్‌లోని పలు మండలాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. మొక్కజొన్న పంటలో కోత, నూర్పిడి పనులు కొనసాగుతున్నాయి. మిరపలో చివరి కోత పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. వర్షం కారణంగా కల్లాల్లో ఆరబోసిన మిరప, మొక్కజొన్న దిగుబడులు తడవకుండా పట్టలు కప్పుకునేందుకు రైతులు అవస్థలు పడ్డారు. పొట్టదశలో ఉన్న వరి నేలవాలడంతో వడ్లు రాలిపోతాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
- నందవరం మండలంలో నాగలదిన్నె, పెద్దకొత్తిలి, జొహరాపురం, గంగవరం, రాయచోటి, నందవరం, నదికైరవాడి తదితర గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. మొక్కజొన్న గింజలు, ఎండు మిర్చి తడిసిపోకుండా పట్టలు కప్పుకుంటూ అన్నదాతలు నానా అవస్థలు పడ్డారు. వరి, మొక్కజొన్న, మిరప పంటలు తిన్నాయి.



సి.బెళగల్ సమీపంలో పొలంలో నిలిచిన వర్షపు నీరు



తడిసిన పొగాకును సరిచేసుకుంటున్న రైతు



గుండుపాపలలో తడిసిపోయిన మిరప



తిమ్మనాయినపేటలో తడిచిన పసుపు



బుక్కాపురం సమీపంలో తడిసిన పుసుపు



నందవరం సమీపంలో తడిసిన మొక్కజొన్న

మూల్యాంకనం ప్రారంభం



స్పాట్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఈఓ ఎస్.శామ్యూల్ పాల్

కర్నూలు సిటీ: పదో తరగతి పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనం గురువారం ప్రారంభమైంది. నగర శివారులోని ఓ ప్రైవేటు స్కూల్‌లో స్పాట్ క్యాంపును ఏర్పాటు చేశారు. జిల్లాకు 1,93,747 సమాధాన పత్రాలు వివిధ జిల్లాల నుంచి వచ్చాయి. మూల్యాంకనం చేసేందుకు నియమించిన ఉపాధ్యాయులు మొదటి రోజున 89 చీఫ్ ఎగ్జామినర్లు, 537 మంది అసిస్టెంట్ ఎగ్జామినర్లు, 145 మంది స్పెషల్ అసిస్టెంట్లు విధుల్లో చేరారు. వారిని సర్దుబాటు చేసే ప్రక్రియ కొంత ఆలస్యమైంది. క్యాంపు ఆఫీసర్‌గా వ్యవహరించిన డీఈఓ ఎస్.శ్యామూల్ పాల్ ముందుగా విధుల్లో చేరిన వారితో సమావేశం నిర్వహించి సూచనలు చేశారు. ప్రతి రోజు ఎన్ని పేపర్లు మూల్యాంకనం చేయాలో కచ్చితంగా నిర్దేశించిన సమయంలోపు పూర్తి చేయాలన్నారు. ఆ తరువాత మొదలైన స్పాట్‌లో మొదటి రోజు సోషల్, ఒకేషనల్ మినహా 11,081 వేల పేపర్లను మూల్యాంకనం చేశారు. అదే విధంగా ఓపెన్ టెన్త్ పేపర్లు 16,220 సమాధాన పత్రాలు జిల్లాకు రాగా, మూల్యాంకనం చేసేందుకు 15 మంది చీఫ్ ఎగ్జామినర్లు, 82 మంది అసిస్టెంట్ ఎగ్జామినర్లను నియమించగా, మొదట రోజున 1,275 పేపర్లను మూల్యాంకనం చేశారు.

రేపు శ్రీశైలంలో స్వర్ణ రథోత్సవం

శ్రీశైలంటెంపుల్: ఆరుద్రా నక్షత్రాన్ని పురస్కరించుకుని ఆనవాయితీ ప్రకారం ఈనెల 5న రోజున శ్రీశైల మహా క్షేత్రంలో స్వామి అమ్మవార్లకు స్వర్ణ రథోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. గంగాధర మండపం నుంచి నంది మండపం వరకు లాగి అనంతరం తిరిగి యథాస్థానానికి చేర్చనున్నట్లు తెలిపారు.

రెండు రేషన్ షాపులపై 6ఏ కేసులు

కర్నూలు(సెంట్రల్): ఉండాల్సిన దాని కంటే తక్కువగా బియ్యం ఉన్న మరో రెండు రేషన్ షాపులపై పౌరసరఫరాల అధికారులు 6ఏ కేసులు నమోదు చేశారు. గురువారం నగరంలోని 53వ నంబరు రేషన్ షాపులో డీఎస్ఓ రాజారఘువీర్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించగా 3290 కేజీల బియ్యం, 604 కేజీల జొన్నలు తక్కువగా ఉన్నాయి. అలాగే రేషన్ షాపు నంబర్ 162లో 1800 కేజీల బియ్యం, 286 ప్యాకెట్ల చక్కెర ఉండడంతో యాజమాని రవిపై కేసు నమోదు చేశారు. దాడుల్లో ఏఎస్ఓ రామాంజనేయరెడ్డి, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖరరెడ్డి పాల్గొన్నారు.

పిడుగుపాటుకు ఐదుగురికి అస్వస్థత

- ఇనగండ్ల సమీపంలో దుర్ఘటన
- ఒకరి పరిస్థితి విషమం

సి.బెళగల్: ఇనగండ్ల గ్రామ క్రాస్ రోడ్డు సమీపంలో పిడుగుపాటుకు ఐదుగురు వ్యక్తులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. గురువారం మధ్యాహ్నం 3:45 గంటల సమయంలో గాలులతో కూడిన వర్షం మొదలైంది. ఈ క్రమంలో బైక్‌పై వెళ్తున్న వాహనదారులు ఇనగండ్ల క్రాస్ రోడ్డులో ఉన్న బస్ షెల్టర్‌లోకి చేరుకున్నారు. ఆ సమయంలో భారీ శబ్దంతో సమీపంలో పిడుగు పడింది. దీంతో బస్‌షెల్టర్‌లో ఉన్న ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధిహామీ పథకం కంప్యూటర్ ఆపరేటర్గా (సీఓ) సుధాకర్, కోడుమూరు మండలం అనుగొండ గ్రామానికి చెందిన ఈడిగ లక్ష్మీనారాయణ, ఇనగండ్ల గ్రామానికి చెందిన దేవవరం, రాఘవేంద్ర, గుండ్రేవుల గ్రామానికి చెందిన దస్తగిరి అస్వస్థతకు గురయ్యారు. సమీపంలో ఉన్న కొందరు వారిని గమనించి వెంటనే కర్నూలు ఆసుపత్రికి తరలించారు. కాగా సుధాకర్‌కు పరిస్థితి విషయంగా ఉండగా, దేవవరం కళ్లకు వాపులు రాగా, ఈడిగ లక్ష్మీనారాయణ కాళ్లకు కాలిన గాయాలు కాగా, దస్తగిరి కుడికాలు, కుడి చేయి స్పందించడం లేదని తెలుస్తోంది. కాగా విషయం తెలుసుకున్న ఇన్‌చార్జ్ తహసీల్దార్ పురుషోత్తం, ఎంపీడీఓ రాణెమ్మ సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని తెలుసుకున్నారు. ఎస్ఐ తిమ్మారెడ్డి కర్నూలు ఆసుపత్రికి చేరుకుని బాధితులను పరిశీలించి వారి వివరాలను సేకరించారు. అదేవిధంగా మండల కేంద్రం సి.బెళగల్ గ్రామానికి చెందిన కాలమాబు ఇంట్లో పిడుగుపాటుకు గ్యాస్ సిలిండర్ పేలినట్లు తెలుస్తోంది. కాగా ఈ ఘటనలో కాలమాబు కుటుంబ సభ్యులకు ప్రమాదం తృటిలో తప్పినట్లు స్థానికులు తెలిపారు.



తీవ్ర అస్వస్థత గురైన ఉపాధిహామీ సీఓ సుధాకర్

క్లుప్తంగా

నేడు జాతీయ రైతు సదస్సు

- హాజరు కానున్న కేరళ, తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రులు

కర్నూలు(సెంట్రల్): కర్నూలులో శుక్రవారం జరిగే జాతీయ రైతు సదస్సును జయప్రదం చేయాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.జగన్నాథం గురువారం ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. నగరంలోని లక్ష్మీనరసింహ కల్యాణ మండపంలో జరిగే సదస్సుకు కేరళ, తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పి.ప్రసాదు, ఏపీ పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్, ఉమ్మడి ఏపీ మాజీ వ్యవసాయ శాఖ మంత్రి, రఘువీరారెడ్డి, కిసాన్ సభ జాతీయ కార్యదర్శి రావుల వెంకయ్య హాజరవుతున్నట్లు తెలిపారు. ఈ నెల 15, 16, 17 తేదీల్లో తమిళనాడులోని నాగపట్నంలో ఆల్ ఇండియా కిసాన్ సభ జాతీయ మహాసభలు జరుగునున్న నేపథ్యంలో కర్నూలులో 4వ తేదీన జాతీయ రైతు సదస్సును ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పాతబస్టాండులోని శ్రీలక్ష్మీ నరసింహ కల్యాణ మండపంలో జరిగే సదస్సులో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి జాతీయ మహాసభల్లో తీర్మానం చేయనున్నట్లు చెప్పారు.

ఏఈవోల సంఘం డైరీ విడుదల



ఏఇవోల సంఘం డైరీని విడుదల చేస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మి

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లా వ్యవసాయ విస్తరణ అధికారుల సంఘం 2025 డైరీని జిల్లా వ్యవసాయ అధికారి (డీఏవో) పీఎల్ వరలక్ష్మి విడుదల చేశారు. గురువారం తన కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగేశ్వరరెడ్డి, జిల్లా అధ్యక్షుడు చాంద్‌బాషా ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో డైరీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగేశ్వరరెడ్డి మాట్లాడుతూ... జిల్లాలో ఏఈవోలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను జిల్లా వ్యవసాయ అధికారి దృష్టికి తీసుకెళ్లారు. డీఏవో స్పందిస్తూ ఏఈవోలు ఎదుర్కొంటున్న అన్ని రకాల సమస్యలను పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు మనోహర్, నరసింహుడు, ఇందుమతి జిల్లా, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

చౌడేశ్వరిదేవికి ప్రణమిల్లి..



ఆలయంలో కొలువైన చౌడేశ్వరిదేవి అమ్మవారు

- వైభవంగా జ్యోతి మహోత్సవం
- అబ్బుర పరిచిన తొగటవీర క్షత్రియుల విన్యాసాలు
- కిటకిటలాడిన నందవరం



అమ్మవారి ఆలయానికి చేరుకుంటున్న జ్యోతులు



తొగట వీరక్షత్రియుల నృత్యాలు

బనగానపల్లె: అర్ధరాత్రి భక్తి కెరటం ఎగిసింది. జ్యోతులు దేదీప్యమానంగా వెలుగొందాయి. 'చల్లగా దీవించు తల్లీ' అంటూ.. భక్తజనం చౌడేశ్వరి దేవి ముంగిట ప్రణమిల్లారు. నందవరంలో వెలిసిన చౌడేశ్వరిదేవి అమ్మవారి జ్యోతి మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. గత నెల 30వ తేదీన ప్రారంభమైన ఉత్సవాల్లో ప్రధాన ఘట్టమైన జ్యోతుల సమర్పణ కార్యక్రమానికి కర్ణాటక, మహారాష్ట్రాల నుంచి భక్తజనం తరలివచ్చారు. బుధవారం అర్ధరాత్రి నుంచి జ్యోతి మహోత్సవం కనులపండువగా సాగింది. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కామేశ్వరమ్మ, ఆలయ అర్చకులు, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా ముందుగా భాస్కరయ్య ఆచారి అమ్మవారికి దిష్టిచుక్క పెట్టు కార్యక్రమాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. అనంతరం ఒంటిగంట నుంచి గ్రామంలోని శ్రీ చెన్నకేశస్వామి దేవస్థానం తొగటవీర క్షత్రియులు, భక్తులు జ్యోతులు తలపై పెట్టుకొని భక్తి గీతాలు పాడుకుంటూ మేళతాళాలతో బయల్దేరారు. మొదట సర్కార్ వారి జ్యోతి బయలుదేరగా.. మిగతా జ్యోతులు గ్రామ చావిడి, బస్టాండ్ మీదుగా చౌడేశ్వరిదేవి అమ్మవారి ఆలయం వద్దకు చేరుకున్నాయి. దేవస్థానం ముందు ఏర్పాటు చేసిన అగ్ని గుండంలో భక్తులు నడుచుకుంటూ వచ్చి ఆలయ గర్భగుడిలో కొలువైన శ్రీ చౌడేశ్వరిదేవి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించారు. ఉత్సవంలో తొగటవీర క్షత్రియులు ప్రదర్శించిన కత్తి సాము ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. సర్కార్ వారి జ్యోతి వద్ద భక్తుల రద్దీని నివారించేందుకు డోన్ డీఎస్పీ శ్రీనివాసులు, బనగానపల్లె రూరల్ సీఐ మంజునాథ్‌రెడ్డి, ఎస్ఐ వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది సుమారు 750 జ్యోతులకుపైగా రావడంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. జ్యోతి ఉత్సవాల సందర్భంగా రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి సతీమణి బీసీ ఇందిరమ్మ అమ్మవారికి జ్యోతిని సమర్పించారు. గురువారం సాయంత్రం అమ్మవారి ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించిన రథంపై ముస్తాబు చేసి రథోత్సవాన్ని నిర్వహించారు. గ్రామ ముఖద్వారం వరకు భక్తులు రథాన్ని లాగారు. శుక్రవారం తిరుగు రథోత్సవం నిర్వహించన్నారు. ఈనెల 5వ తేదీన ఉత్సవాలు ముగియనున్నాయి.





అగ్నిగుండంలో నడుస్తున్న భక్తులు,తొగటవీర క్షత్రీయుడి విన్యాసం

అనుమానాస్పద స్థితిలో విద్యార్థి మృతి



మృతిచెందిన నరేష్ (ఫైల్)

కర్నూలు: కోడుమూరు మండలం లద్దగిరి హాస్టల్‌లో 9వ తరగతి చదువుతున్న నరేష్ అలియాస్ నాని (15) అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. వెల్దుర్తి మండలం నరసాపురం గ్రామానికి చెందిన బజారి, మహదేవి దంపతులకు ఇద్దరు కూతుర్లు, కుమారుడు నరేష్ ఉన్నారు. మహదేవి ఐదేళ్ల క్రితం ఆత్మహత్య చేసుకుంది. అప్పటి ఆమె పిల్లలు కృష్ణగిరి మండలం రామకృష్ణాపురంలో మేనమామ మధు సంరక్షణలో ఉంటున్నారు. కాగా బజారి కర్నూలు వీకర్ సెక్షన్ కాలనీకి చెందిన లిల్లీని వివాహం చేసుకుని ఇక్కడే ఉంటున్నాడు. నరేష్ లద్దగిరి హాస్టల్‌లో చదువుకుంటూ తరచూ కర్నూలులో ఉన్న తండ్రి దగ్గరకు వచ్చేవాడు. ఈ నేపథ్యంలో మూడు రోజుల క్రితం హాస్టల్ నుంచి పారిపోయి తండ్రి బజారి వద్దకు వచ్చాడు. గురువారం అనుమానాస్పద స్థితిలో ఇంట్లో చనిపోయాడు. కాగా మొదటి భార్య చనిపోయినప్పుడు పిల్లలకు బజారి 3 ఎకరాల పొలాన్ని రాసిచ్చాడు. అందుకు సంబంధించిన పత్రాలు తీసుకురావాలని కుమారుడు నరేష్‌పై తండ్రి బజారి ఒత్తిడి పెంచి కొట్టి హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నట్లు మేనమామ మధు ఫిర్యాదు మేరకు నాలుగో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కమనీయం.. రథోత్సవం



అశేష జనవాహిని మధ్య కొనసాగుతున్న వీరభద్ర స్వామి రథోత్సవం

ఆస్పరి: కైరుప్పల గ్రామంలో గురువారం అశేష జనవాహిని మధ్య వీరభద్రస్వామి రథోత్సవం కనుల పండువగా జరిగింది. వీరభద్ర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ముందుగా ఆలయంలో వీరభద్రస్వామి, కాళికాదేవికి ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారి ఉత్సవ విగ్రహాలను మేళతాళాలతో ఊరేగించారు. రథం ముందు పురోహితుడు మల్లికార్జున స్వామి పూజలు నిర్వహించి రథంపై ఉత్సవ విగ్రహాలను చేర్చారు. అనంతరం జయ జయ ధ్వానాల మధ్య స్వామి వారి రథోత్సవం ప్రారంభమైంది. బసవన్న దేవాలయం వరకు, తిరిగి రథశాల వద్దకు లాగారు. రథోత్సవాన్ని చూడటానికి వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు కదిలి వచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ తిమ్మక్క, ఆలూరు ఎమ్మెల్యే తనయుడు చంద్రశేఖర్, వెంగళాయిదొడ్డి ఆయకట్టు చైర్మన్ బసవరాజు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాన్ని తరిమేలా.. ప్రాణాలు రక్షించేలా!

- కులుమాలలో ప్రమాదకరంగా విద్యుత్ తీగలు
- అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోని వైనం
- రూ. 2.50 లక్షల సొంత నిధులతో సమస్యను పరిష్కరించిన బుట్టా రేణుక



కులుమాల గ్రామంలోని బీసీ కాలనీలో ఏర్పాటు చేసిన కొత్త విద్యుత్ స్తంభాలు



బుట్టా రేణుక

గోనెగండ్ల: 'సార్.. విద్యుత్ తీగలు ఇళ్ల ముందర వేలాడుతున్నాయి. మిద్దెలపైకి వెళ్లాంటే భయమేస్తోంది. విద్యుత్ తీగలు తగిలి ఓ వ్యక్తి చనిపోయాడు' అని అధికారులకు ప్రజలు మొరపెట్టుకున్నా స్పందించ లేదు. చివరకు సమస్య వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టా రేణుక దృష్టికి వెళ్లడంతో ఆమె సొంత నిధులతో పరిష్కరించారు. కులుమాల గ్రామంలోని బీసీ కాలనీలో గత 20 ఏళ్లుగా 11 కేవీ విద్యుత్ తీగలు ఇళ్లపై వెళ్లడం ద్వారా గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇంటిపైకి వెళ్లాలంటే ఆ తీగలు తగిలి ప్రాణాలు పోతాయని భయపడుతున్నారు. అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోలేదు. ఆ తీగలు తగిలి ఓ వ్యక్తి ప్రాణాన్ని కోల్పోయాడు. మరికొందరు ప్రమాదం నుంచి తృటిలో తప్పించుకున్నారు. చివరకు గ్రామంలో నెలకొన్న విద్యుత్ తీగల సమస్యను పరిష్కరించాలని ఆ గ్రామస్తులు వైఎస్సార్‌సీపీ జిల్లా ఆక్టివిటీ కార్యదర్శి నాగేష్ నాయుడు పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టా రేణుక దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆమె సంబంధిత అధికారులతో మాట్లాడి సొంత నిధులు రూ.2.50 వెచ్చించి సమస్యను పరిష్కరించారు. రెండు రోజుల క్రితం కొత్త విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి 11కేవీ విద్యుత్ తీగలను సురక్షిత మార్గంలో మార్పు చేసి సమస్యను పరిష్కరించడంతో గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ మేరకు బుట్టా రేణక, నాగేష్ నాయుడికి గ్రామస్తులతో పాటు వైఎస్సార్‌సీపీ మండల ఉపాధ్యక్షుడు పేట అల్లా బకాష్, ఎగ్జిక్యూటివ్ మెంబర్ గొల్ల నరసింహుడు, వీరేష్, మద్దిలేటి, మద్ది, రాజు, దుబ్బన్న, మల్లికార్జున, రామాంజిని తదితరులు కృతజ్ఞతలు తెలిపారు.

నందికొట్కూరులో చోరీ

నందికొట్కూరు: పట్టణంలోని సాయిబాబాపేటలో ఓ ఇంట్లో చోరీ జరిగింది. ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపిన వివరాల మేరకు.. స్థానికంగా నివాసముంటున్న షేక్ మహబూబ్‌బాషా ఇటీవల తన తమ్ముడు షేక్ రహంతుల్లా కుమారుడు అబ్దుల్లా రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. కాగా ఆర్ఆర్ వెంచర్‌లో ఉన్న తమ్ముడి ఇంటికి మహబూబ్‌బాషా కుటుంబ సభ్యులందరూ ప్రతి రోజు రాత్రి తోడుగా వెళ్లి నిద్రిస్తున్నారు. ఈ క్రమంలో గుర్తు తెలియని వ్యక్తులు బుధవారం రాత్రి ఇంటి తాళాలు పగలగొట్టి బీరువాలోని 60 తులాల వెండి, రూ. 50 వేలు, విలువైన రెండు గడియారాలు, ముక్కుపుడక అపహరించారు. గురువారం ఉదయం ఇంటికి వచ్చి చూసుకునే సరికి తలుపు తెరిచి ఉండటంతో చోరీ జరిగిందని భావించి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలాన్ని ఎస్ఐ పరిశీలించారు. బాధితుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వడదెబ్బతో యాచకుడి మృతి



మృతి చెందిన యాచకుడు

కోవెలకుంట్ల: స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో గుర్తు తెలియని యాచకుడు గురువారం వడదెబ్బతో మృతి చెందాడు. స్థానికులు అందించిన సమాచారం మేరకు.. 60 సంవత్సరాలకు పైబడిన ఓ గుర్తు తెలియని యాచకుడు కొన్ని రోజుల క్రితం భిక్షాటనకు కోవెలకుంట్లకు వచ్చాడు. ప్రతి రోజు పట్టణంలో భిక్షాటన చేసుకుని రాత్రి సమయాల్లో బస్టాండ్ పరిసరాల్లో నిద్రించేవాడు. రోజులాగే గురువారం ఉదయం భిక్షాటన నిమిత్తం వెళ్లి ఎండ తీవ్రత కారణంగా వడదెబ్బకు గురయ్యాడు. అనారోగ్యంతోనే బస్టాండ్ వద్దకు చేరుకుని కుప్పకూలిపోయి మృతి చెందాడు. ప్రయాణికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్ఐ మల్లికార్జునరెడ్డి సంఘటన స్థలానికి చేరుకుని యాచకుడి చిరునామా వివరాలు ఆరా తీశారు. వివరాలు లభ్యం కాకపోవడంతో మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

మైనారిటీలకు ప్రధానమంత్రి ఉపాధి కల్పన పథకాలు

కర్నూలు(అర్బన్):ఉమ్మడి కర్నూలు జిల్లాలోని ముస్లిం, క్రైస్తవులు, జైనులు, సిక్కులు, బౌద్ధులు, పారిశీకులకు ప్రధానమంత్రి ఉపాధి కల్పన పథకాలను వర్తింపజేయనున్నట్లు జిల్లా మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఈడీ సయ్యద్ సబీహా పర్వీన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకం కింద గరిష్ట ప్రాజెక్టు వ్యయ పరిమితి (తయారీ రంగానికి) రూ.50 లక్షలు, సేవా రంగానికి రూ.20 లక్షలతో ప్రాజెక్టును ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. లబ్ధిదారుల వర్గీకరణను అనుసరించి కేంద్ర ప్రభుత్వం నుంచి సబ్సిడీ రేటు ప్రాజెక్టు విలువలో 15 నుంచి 35 శాతం వరకు ఉంటుందన్నారు. అలాగే లబ్దిదారుని వాటా సాధారణ వర్గాలకు చెందిన వారికి 10 శాతం, ప్రత్యేక వర్గాలకు (ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ,మైనారిటీ, మహిళలు, ట్రాన్స్ జెండర్లు,మాజీ సైనికులు, వికలాంగులు) 5 శాతంతో ఏదేని బ్యాంకు ద్వారా రుణ సహాయం పొందవచ్చన్నారు. అభ్యర్థులు https://www.kivconline.gov.in/pmegpeportal/jsp/pmegponline.jsp వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరింత సమాచారం కోసం 8185052786, 9440822219ను సంప్రదించాలన్నారు.

వీరభద్రా.. శరణు.. శరణు !



రథోత్సవాన్ని తిలకిస్తున్న భక్తజనం

తుగ్గలి: ఎదులదొడ్డిలో వెలిసిన వీరభద్రస్వామి రథోత్సవం వైభవంగా సాగింది. గురువారం వేకువజామున వేదమంత్రోచ్ఛారణల మధ్య శ్రీ కాళికామాతా సమేత శ్రీ వీరభద్రస్వామి కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. స్థానికులతో పాటు వివిధ గ్రామాల పెద్ద ఎత్తున తరలి వచ్చిన భక్తులు స్వామికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించు కున్నారు. సాయంత్రం స్వామి ఉత్సవమూర్తులను పూలతో అలంకరించిన రథంలో ఉంచి భక్తులు రథాన్ని లాగారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పత్తికొండ రూరల్ సీఐ పులిశేఖర్ పర్యవేక్షణలో తుగ్గలి ఎస్ఐ కృష్ణమూర్తి, పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు, గ్రామ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

క్రీడా కేంద్రానికి ఇద్దరు ఎంపిక



క్రీడాకారులను అభినందిస్తున్న సభ్యులు

నంద్యాల(న్యూటౌన్): భారత క్రీడల శాఖ స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో కర్నూలులో ఉన్న తైక్వాండో కేంద్రానికి నంద్యాలకు చెందిన పవన్ తేజ, జంషీద్ హుసేన్ ఎంపికైనట్లు నంద్యాల లయన్స్ క్లబ్ కార్యదర్శి రమేష్, నంద్యాల జిల్లా పారా ఒలంపిక్ కార్యదర్శి రమణయ్యలు పేర్కొన్నారు. ఎంపికైన క్రీడాకారులను గురువారం ఐఎంఏ మాజీ అధ్యక్షుడు రవికృష్ణ తదితరులు అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడాకారులు క్రమశిక్షణతో కూడిన పాఠశాలలో నిరంతర సాధన కృషి చేస్తే జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలన్నారు. కార్యక్రమంలో వెలుగోడు మాజీ జెడ్పీటీసీ లాలు స్వామి, కోచ్‌లు మహబూబ్‌బాషా, ఉదయ్‌కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

కొలిమిగుండ్ల: అంకిరెడ్డిపల్లెలోని చింతలాయిపల్లె రోడ్డులో నివాసం ఉంటున్న ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. అవుకు మండలం రామాపురానికి చెందిన ఉమ్మడి వెంకట్రామిరెడ్డి(48) జీవనోపాధి నిమిత్తం దాదాపు పదిహేనేళ్ల క్రితం అంకిరెడ్డిపల్లెలో స్థిరపడ్డాడు. ఇతనికి దివ్యాంగురాలైన భార్య వసుంధరదేవి ఉంది. వీరికి సంతానం లేదు. ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తూ జీవిస్తున్న ఇతను మద్యానికి బానిసై నిత్యం భార్యతో గొడవపడేవాడు. నెల రోజుల క్రితం భర్తతో గొడవపడి భార్య అనంతపురం జిల్లా యాడికి మండలంలోని చిక్కెపల్లెలోని పుట్టింటికి వెళ్లి పోయింది. అయితే రెండు రోజుల క్రితం ఓ ట్రాక్టర్ డ్రైవర్‌తో వెంకట్రామిరెడ్డి గొడవ పడ్డాడు. ఈ క్రమంలో గురువారం ఇంట్లో ఉరేసుకుని మృతి చెందాడు. కాగా సూసైడ్ నోట్‌లో గోపాల్ అనే వ్యక్తి పేరుతో పాటు, జీవితంపై విరక్తి చెంది తాను ఆత్మహత్య చేసుకున్నట్లు రాశాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి ఆత్మహత్యకు కారణాలపై ఆరా తీస్తున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

భార్యతో గొడవ పడి..

కర్నూలు: స్థానిక శ్రీరాం నగర్ సచివాలయ సమీపంలో నివాసముంటున్న బెస్త బాలకృష్ణ (38) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈయన కారు డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. భార్య సునంద ఓ మొబైల్ దుకాణంలో పనిచేస్తూ కుటుంబానికి చేదోడుగా ఉండేది. వీరికి ముగ్గురు సంతానం. బాలకృష్ణ మద్యానికి బానిసై కొంతకాలంగా పనికి వెళ్లకుండా ఉంటూ డబ్బుల కోసం భార్యను వేధించేవాడు. బుధవారం రాత్రి కూడా 10 గంటల సమయంలో ఇంటికి వచ్చి డబ్బుల కోసం భార్య సునందతో గొడవ పెట్టుకున్నాడు. ఆమె తల్లిదండ్రులు కూడా అదే కాలనీలో నివాసముంటుండటంతో పిల్లలతో కలసి రాత్రి పుట్టింటికి వెళ్లింది. గురువారం ఉదయం తిరిగి ఇంటికి వచ్చేసరికి భర్త ఉరికి వేలాడుతూ కనిపించాడు. ఈ మేరకు మూడో పట్టణ పోలీసులకు సునంద ఫిర్యాదు చేశారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఆత్మహత్యకు దారితీసిన కారణాలపై విచారించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రిలోని మార్చురీ కేంద్రానికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఎస్సార్బీసీ సమీపంలో కోతకు గురైన ఆర్‌అండ్‌బీ రోడ్డు



రాళ్లే హెచ్చరిక

కోవెలకుంట్ల నుంచి గుంజలపాడు మీదుగా సంజామలకు వెళ్లే ఆర్‌అండ్‌బీ రహదారిలో ప్రమాదం పొంచి ఉంది. పట్టణ శివారులోని ఎస్సార్బీసీ 10వ బ్లాక్ కాల్వ సమీపంలో రోడ్డు ఒకవైపు కోతకు గురవుతోంది. వాహనదారులు దగ్గరకు వెళ్లే వరకు రోడ్డు దెబ్బతిన్న ప్రాంతం కన్పించడం లేదు. కోతకు గురైన రోడ్డు పక్కనే లోతట్టు ప్రదేశం ఉండటంతో వాహనాలు దెబ్బతిన్న రోడ్డు ప్రాంతంలో ఎదురెదురు పడినా, గమనించకుండా వాహనాలు నడిపినా వాహనాలు లోతట్టు ప్రాంతంలో పడి ప్రాణాలు గాలిలో కలిసిపోయే ప్రమాదం నెలకొంది. ఆర్‌అండ్‌బీ అధికారులు చర్యలు తీసుకుని రోడ్డు కోతకు గురైన ప్రాంతంలో మరమ్మతులు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు. – కోవెలకుంట్ల

పోస్టల్ శాఖ స్కాలర్‌షిప్ మంజూరు

కర్నూలు(అర్బన్): పోస్టల్ శాఖ 2024–25 సంవత్సరానికి సంబంధించి నిర్వహించిన దీనదయాళ్ స్పర్శ్ యోజన స్కాలర్‌షిప్ పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు పోస్టల్ సూపరింటెండెంట్ జీ.జనార్దన్‌రెడ్డి నగదు ఉపకార వేతనంతో పాటు ప్రశంసా పత్రాలను అందించారు. గురువారం స్థానిక కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ఈ పరీక్షల్లో నగరంలోని ఎన్ఆర్ పేటలోని సెయింట్ జోసఫ్ ఇంగ్లీషు మీడియం స్కూల్‌కు చెందిన షేక్ మహ్మద్ ఫైజాన్, ఎం.జ్యోతి స్వరూప్‌రెడ్డి ప్రతిభ చాటారన్నారు. వీరికి రూ.6 వేల నగదు, ప్రశంసా పత్రాలను అందించామన్నారు. ఈ నేపథ్యంలోనే పోస్టల్ శాఖ అందిస్తున్న సేవలను ప్రజలు వినియోగించుకోవాలన్నారు. స్టాంపుల సేకరణ, మై స్టాంప్, ధాయి ఆఖర్ లెటర్ రైటింగ్ గురించి అవగాహన కల్పించారు.

జిల్లా స్థాయి సైన్స్ ఎక్స్‌పోలో ప్రతిభ



మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులు

కర్నూలు సిటీ: స్థానిక ప్రభుత్వ బాలికల హైస్కూల్‌లో గురువారం నిర్వహించిన ఎంటర్ ప్రిన్యూర్‌షిప్ మైండ్ సెట్ జిల్లా స్థాయి సైన్స్ ఎక్స్‌పో పలువురు విద్యార్థులు ప్రతిభ చాటారు. ఎస్‌ఈసీఆర్‌టీ కొన్ని అంశాలను ఎంపిక చేసి తయారు చేసిన వీడియోలను ప్రతి శుక్రవారం తరగతి గదుల్లో ప్రదర్శించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ మేరకు 40 స్కూళ్లకు చెందిన విద్యార్థులు ఆవిష్కరించిన ప్రదర్శనలను జిల్లా స్థాయి సైన్స్ ఎక్స్‌పోలో ప్రదర్శించారు. ఈ ప్రదర్శనను బీఈడీ కాలేజీ (ఐఏఎస్ఈ)ప్రిన్సిపాల్ ఆదినారాయణ రెడ్డి, అధ్యాపకురాలు డి.పార్వతిదేవి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల్లో నైపుణ్యాలను వెలికి తీసేందుకు ఈ కార్యక్రమం ఎంతో దోహదపడుతుందన్నారు. ఈ ప్రదర్శనలో ప్రథమ విజేతగా కోడుమూరు మండలం కల్లపరి జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు ఎం.శిరీషా, బి.లక్ష్మీ, హర్షవర్ధన్, ద్వితీయ విజేతగా కర్నూలు నగరంలోని ఏపీజే అబ్దుల్ కలాం మున్సిపల్ మెమోరియల్ హైస్కూల్‌కి చెందిన ఎం.మేఘన, ఎస్.సనా ముస్కాన్, ఆర్.అంజలీనా, తృతీయ విజేతగా గోనెగండ్ల మండలం గంజిహళ్లి జెడ్పీ హైస్కూల్‌కి చెందిన విద్యార్థులు పి.సౌమ్య, ఎ.శ్రావణి, ఎస్.రాజేష్ నిలిచారు. కార్యక్రమంలో ఎంటర్‌ప్రిన్యూర్‌షిప్ మైండ్‌సెట్ జిల్లా కో-ఆర్డినేటర్ గోపాలకృష్ణ, జిల్లా సైన్స్ కో-ఆర్డినేటర్ రంగమ్మ, తదితరులు పాల్గొన్నారు.